epaper : tmedia.net.in

GSTIN-NO:36FDKPS1308P1ZX , Regd. No. 100/20

టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

T MEDIA

మెయిన్ : గురువారం-నవంబర్ 09-2023 పేజీలు : 2

తృణమూల్ ఎంపికి ఈడి సమన్లు

టీ మీడియా, నవంబర్ 8, కోల్‌కతా :

తృణమూల్ కాంగ్రెస్ ఎంపి అభిషేక్ బెనర్జీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి) బుధవారం సమన్లు జారీచేసింది. ఉపాధ్యాయుల నియామక కుంభకోణానికి సంబంధించి గురువారం (నవంబర్ 9) విచారణకు హాజరుకావాలని పేర్కొన్నట్లు టిఎంసి నేత ఒకరు తెలిపారు. అభిషేక్ బెనర్జీ రాజకీయ ప్రతీకార దాడులకు బాధితుడని పశ్చిమబెంగాల్ మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి మరియు టిఎంసి అధికార ప్రతినిధి శశి పంజా ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న సమయంలో ప్రతిపక్ష నేతలను వేధించేందుకు బిజెపి ఇటువంటి ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. రాష్ట్రానికి రావాల్సిన కేంద్ర నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, న్యూఢిల్లీలో జరిగిన టిఎంసి నిరసన ర్యాలీలో పాల్గొనేందుకు అక్టోబర్ 3న సమన్లను దాటవేశారు. దీంతో అక్టోబర్ 9న విచారణకు హాజరుకావాలని సమన్లు జారీ చేసింది. సెప్టెంబర్ 13 జరిగిన ఉపాధ్యయ నియామక కుంభకోణం కేసులో సుమారు తొమ్మిది గంటల పాటు ఈడి అభిషేక్ బెనర్జీని ప్రశ్నించిన సంగతి తెలిసిందే. అయితే తనను ప్రతిపక్ష కూటమి 'ఇండియా' సమావేశంలో పాల్గొనకుండా అడ్డుకునేందుకు యత్నించారని ఆ సమయంలో బెనర్జీ వాదించారు. బొగ్గుదోపిడీ కేసులోనూ ఈడి రెండు సార్లు అభిషేక్ బెనర్జీని ప్రశ్నించింది. 2021లో ఢిల్లీలోని ఏజన్సీ కార్యాలయంలో మరియు 2022లో కోల్‌కతాలో మరోసారి ప్రశ్నించింది.

హాట్ సీటుగా పాలేరు..

కాంగ్రెస్, సీపీఎం పొత్తు కటీఫ్..

-ఎవరి ఓట్లకు గండి..!

టీ మీడియా, నవంబర్ 8, పాలేరు:

తెలంగాణ రాష్ట్రంలోనే హాట్ సీటుగా మారిన పాలేరు నియోజక వర్గంలో.. రోజుకో విధంగా రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. అందరూ ఊహించినట్టుగా తుమ్మల నాగేశ్వరరావు, వైఎస్ షర్మిల పాలేరు పోటీ నంచి తప్పుకున్నారు. అనూహ్యంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ తరపున బరిలోకి దిగుతున్నారు. ఇక బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది. అయితే షర్మిల తప్పుకున్నా.. ఇపుడు సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పోటీకి సై అంటున్నారు. దీంతో గెలుపు ఓటములను ప్రభావితం చేసే లెఫ్ట్ ఓటు బ్యాంకుతో.. ఎవరికి నష్టం ఎవరికి లాభం అన్నదీ హాట్ టాపిక్‌గా మారింది.ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గం తెలంగాణ వ్యాప్తంగా సంచలనంగా మారింది. అంచనాలకు అందని, ఊహించని రాజకీయ పరిణామాలతో ఆసక్తి కరంగా మారింది. చివరి వరకు టికెట్‌పై ఆశ పెట్టుకున్న తుమ్మల నాగేశ్వరరావుకు సీఎం కేసీఆర్ షాక్ ఇచ్చారు. సిట్టింగ్ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రె కి బీఆర్ఎస్ టికెట్ ఇవ్వడంతో.. తుమ్మల కాంగ్రెస్ గూటికి చేరారు. సీతారామ ప్రాజెక్టు పూర్తి చేసి, గోదావరి జలాలతో పాలేరు ప్రజల కాళ్ళు కడుగుతానని, దాని కోసమే పాలేర లో పోటీ చేస్తున్నట్లు తుమ్మల ప్రకటించారు. కానీ అనూహ్యంగా మారిన రాజకీయ సమీకరణాలతో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెరపైకి వచ్చారు. దీంతో తుమ్మల ఖమ్మం నుంచి పోటీ చేస్తున్నారు.వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల పాలేరులో పోటీ చేస్తానని మాట ఇచ్చారు. నియోజకవర్గంలో నూతన క్యాంపు కార్యాలయం, సొంతంగా ఇళ్ళు కూడా నిర్మిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పాదయాత్ర కూడా చేశారు. అయితే ఉహించని విధంగా ఒక దశలో కాంగ్రెస్‌లో పార్టీ విలీనం పై చర్చలు జరిపారు. కానీ దానికి బ్రేక్ పడటంతో ఒంటరిగా పాలేరు లో పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు షర్మిల. కానీ అనూహ్యంగా పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని నిర్ణయించారు. ఇక ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నుంచి పాలేరులో పొంగులేటి శ్రీనివాసరెడ్డి పోటీ చేస్తున్నారు. దీంతో పాలేరు రాజకీయం మరో మలుపు తిరిగింది. షర్మిల పోటీ చేస్తే..కాంగ్రెస్ ఓటు బ్యాంకు, వైఎస్ అభిమానుల ఓట్లు చీల్చి, అంతిమంగా పొంగులేటికి మైనస్ అయ్యి.. బీఆర్ఎస్‌కు అడ్వాంటేజ్‌గా మారుతుందనే లెక్కలు వేసుకున్నారు. ఆ ప్రచారమే జరిగింది. కానీ ఆమె పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించడం కాంగ్రెస్‌కు ,ముఖ్యంగా పొంగులేటికి కొంత ఊరట కలిగించింది.

పాలేరు నియోజకవర్గం మొదటి నుంచి కాంగ్రెస్ కంచుకోట. ఇప్పటి వరకూ ఉప ఎన్నికలతో కలుపుకుని 15 సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో 11 సార్లు కాంగ్రెస్ పార్టీ గెలిస్తే, రెండు సార్లు సీపీఎం, ఒకసారి సీపీఐ, బీఆర్ఎస్ పార్టీలు గెలుపొందాయి. ఈసారి ఎన్నికల్లో లెఫ్ట్, కాంగ్రెస్ మధ్య పొత్తులో సీట్ల సర్దుబాటు కుదరక, సీపీఎం, కాంగ్రెస్ మధ్య బ్రేకప్ అయ్యింది. దీంతో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సొంత నియోజకవర్గం కావడంతో, ఆయన ఇక్కడ నుంచి పోటీ చేస్తున్నారు. సీపీఎం పోటీతో ఎవరికి నష్టం, ఎవరికి లాభం అనే చర్చ జరుగుతోంది. పాలేరులో కమ్యూనిస్టులు గెలిచే స్థితిలో లేకపోయినా, ఒకరి గెలుపు ఓటములను ప్రభావితం చేసే స్థాయిలో ఓట్లు ఉన్నాయి. సీపీఎం, సీపీఐలకు కొంత ఓటు బ్యాంకు ఉంది. ఇపుడు పోటీతో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల్చుతారన్న భావిస్తున్నారు. అది మళ్ళీ అధికార బీఆర్ఎస్‌కు అడ్వాంటేజ్ గా మారుతుందా.. అనే కోణంలో చర్చ జరుగుతోంది. గతంలో బలంగా ఉన్న వామ పక్షాలు రాను రానూ ఉద్యమాలకే పరిమితం అయ్యాయి. ఆ పార్టీలు బలహీన పడ్డారనే వాదన వినిపిస్తోంది.

అమెరికాలో కత్తిపోట్లకు గురైన ఖమ్మం విద్యార్థి మృతి

టీ మీడియా, నవంబర్ 8, వాషింగ్టన్ :

అమెరికా లో కత్తిపోట్లకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన విద్యార్థి వరుణ్ రాజ్ (29) మృతి చెందాడు. పది రోజులుగా తీవ్ర గాయాలతో లూథరన్ దవాఖానలో చికిత్స పొందుతున్న వరుణ్.. పరిస్థితి విషమించడంతో తాజాగా ప్రాణాలు కోల్పోయాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. ఖమ్మం జిల్లా మామిళ్లగూడెంకు చెందిన పుచ్చా వరుణ్ రాజ్ అమెరికాలోని ఇండియానా రాష్ట్రంలో ఎంఎస్ చదువుతున్నాడు. రోజూలాగే అక్టోబర్ 31న జిమ్‌కు వెళ్లిన వరుణ్.. తిరిగి ఇంటికి వెళ్తుండగా ఓ దుండగుడు కత్తితో పొడిచాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. అయితే తీవ్రమైన నరాల బలహీనత ఏర్పడి ఎడమవైపు పాక్షిక వైకల్యం బారినపడే అవకాశం ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ క్రమంలో వరుణ్‌కు లైఫ్‌సపోర్ట్‌తో వైద్యులు చికిత్స అందించారు. అయితే, పరిస్థితి విషమించడంతో తాజాగా ప్రాణాలు కోల్పోయాడు.

పంజాబ్‌లో భూ ప్రకంపనలు

టీ మీడియా, నవంబర్ 8, పంజాబ్ :

పంజాబ్ రాష్ట్రంలో భూకంపం సంభవించింది. బుధవారం తెల్లవారుజామున 1:13 గంటల ప్రాంతంలో స్వల్పంగా భూమి కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 3.2గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. రూప్‌నగర్ ప్రాంతంలో భూమికి 10 కిలోమీటర్లు లోతులో భూకంపం కేంద్రాన్ని గుర్తించినట్లు తెలిపింది. ఒక్కసారిగా భూమి కంపించడంతో గాఢ నిద్రలో ఉన్న ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

ఏపీ సీఎం జగన్‌కు తెలంగాణ హైకోర్టు నోటీసులు

టీ మీడియా, నవంబర్ 8, హైదరాబాద్ :

ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తెలంగాణ హైకోర్టు బుధవారం నోటీసులు జారీ చేసింది. అక్రమాస్తుల కేసులో మాజీ ఎంపీ హరిరామ జోగయ్య దాఖలు చేసిన పిల్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్‌వీ శ్రావణ్‌కుమార్ ధర్మాసనం విచారణ జరిపింది. పిల్‌గా పరిశీలించేందుకు రిజిస్ట్రీ పేర్కొన్న అభ్యంతరాలుపై విచారణ చేపట్టింది. పిల్‌లో సవరణలను హైకోర్టు పరిగణలోకి తీసుకున్నది. మాజీ ఎంపీ తరఫున న్యాయవాది పోలిశెట్టి రాధాకృష్ణ వాదనలతో ధర్మాసనం ఏకీభవిస్తూ ప్రజాప్రయోజన వ్యాజ్యంగా పరిగణించేందుకు కోర్టు అంగీకారం తెలిపింది. ఈ మేరకు జోగయ్య పిల్‌కు నెంబర్‌ను కేటాయించాలని రిజిస్ట్రీకి ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా ప్రతివాదులైన ఏపీ సీఎం జగన్‌తో పాటు సీబీఐ, సీబీఐ కోర్టుకు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. సీబీఐ కోర్టులో జగన్ కేసుల విచారణ వేగంగా పూర్తయ్యేలా ఆదేశించాలని కోర్టును మాజీ ఎంపీ కోరారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లోపే కేసులను తేల్చేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ తీరుతో 58 ఏండ్లు గోసపడ్డాం, బాధపడ్డాం

- సీఎం కేసీఆర్

టీ మీడియా, నవంబర్ 8, కాగజ్‌నగర్ :

సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు తాను ఎమ్మెల్యే అనే గర్వం లేదు.. గ్రామాల్లో తిరుగుతూ ప్రజలతో మమేకమైపోతారని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రశంసించారు. అలాంటి ఎమ్మెల్యేను పొగోట్టుకోవద్దు అని, భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని నియోజకవర్గ ప్రజలకు కేసీఆర్ పిలుపునిచ్చారు. సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఎన్నికలు వచ్చినప్పుడు ఆగమాగం కాకుండా.. ఎవరు గెలిస్తే మంచిదో నిర్ణయించి ఓటేయాలి.. ఆషామాషీగా, అలవోకగా ఓటు వేయొద్దని ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారు. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు అయింది. కానీ ఇప్పటి వరకు కూడా ప్రజాస్వామ్య ప్రక్రియ రావాల్సిన పరిణితి రాలేదు. ఏ దేశాల్లో అయితే ప్రజాస్వామ్యంలో పరిణితి వచ్చిందో ఆ దేశాలు చాలా బాగా ముందుకు పోతున్నాయి. మన దేశంలో ఇంకా ఆ పరిస్థితి లేదు. రావాల్సిన అవసరం ఉంది. ఎలక్షన్లు చాలా వస్తాయి పోతాయి. ఎన్నికల్లో ఎవరో ఒకరు గెలుస్తరు అందరికీ తెలసు. మీరు చాలా సార్లు ఓట్లేశారు. ఇప్పుడు ఎన్నికలు వచ్చాయి. ప్రతి పార్టీ తరపున ఒకరు నిలబడుతారు. కోనప్ప బీఆర్ఎస్ తరపు ఉన్నారు. 30న ఓట్లు పడుతాయి. 3న లెక్కింపు అయిపోతది. ఫలితం తేలుతుందన్నారు కేసీఆర్. మీరు నిర్ణయం తీసుకోవాల్సి ఏందంటే అభ్యర్థి గుణగణాలు, సేవాతత్వం గురించి ఆలోచన చేయాలి. ఆ అభ్యర్థుల వెనుకాల ఏ పార్టీ ఉంది. వాటి చరిత్ర విధానాలు, ప్రజలు, రైతుల గురించి ఏం ఆలోచిస్తుంది..? అధికారం వస్తే ఎలా ప్రవర్తిస్తారో ఆలోచించాలి. ఎన్నికలు అయిపోగానే ప్రక్రియ ఆగిపోదు. ఇక్కడ గెలిచే ఎమ్మెల్యేతో రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడుతుంది. మీ ఓటు వజ్రాయుధం, చాలా విలువ ఉంటది. ఐదేండ్లు మీ తలరాతను రాస్తది. భవిష్యత్‌ను నిర్ణయిస్తది. అందుకే జాగ్రత్తగా ఓటు వేయాలి. ఆషామాషీగా, అలవోకగా వేయొద్దు. మంచి ఆలోచించే వారికి ఓట్లు వేయాలి. ఏ ప్రభుత్వం ఏం చేసిందో లెక్క తీసి ఓట్లు వేస్తే లాభం జరుగుతది. ప్రజాస్వామ్య పరిణితి పెరిగి, విచక్షణ జ్ఞానంతో ఎవరు గెలిస్తే మంచిదో నిర్ణయించి ఓటేయాలి అని ప్రజలకు కేసీఆర్ సూచించారు.బీఆర్ఎస్ పార్టీ చరిత్ర మీకు తెలుసు. తెలంగాణ ప్రజల కోసం, హక్కుల కోసం పుట్టింది బీఆర్ఎస్. రాష్ట్రాన్ని సాధించింది. ఈ పదేండ్లు నుంచి ప్రభుత్వం నడుపుతున్నాం. గత ప్రభుత్వాలకు బీఆర్ఎస్ కు తేడా ఆలోచించాలి. అభివృద్ధి మీ కండ్ల ముందుంది. 50 ఏండ్లు కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారు. ఉన్న రాష్ట్రాన్ని బలవంతంగా తీసుకెళ్లి ఏపీలో కలిపారు. దాంతో 58 ఏండ్లు గోస పడ్డం. నష్టపోయాం. బాధపడ్డాం అని కేసీఆర్ పేర్కొన్నారు. 2004లో పొత్తు పెట్టుకుని తెలంగాణ ఇస్తామన్నారు కాంగ్రెసోళ్లు. నమ్మి కలిశాం. అప్పుడు అధికారం వచ్చింది. తెలంగాణ వెంటనే ఇవ్వలేదు. ఏడాదికి, రెండేండ్లకు కూడా ఇవ్వలేదు. మళ్లీ బీఆర్ఎస్ పార్టీని చీల్చే ప్రయత్నం చేశారు. 14 ఏండ్లు కొట్లాడితే.. కేసీఆర్ సచ్చుడో, తెలంగాణ వచ్చుడో అని ఆమరణ దీక్ష చేస్తే దిగొచ్చి తెలంగాణ ప్రకటన చేశారు. మళ్లీ ప్రకటన వెనక్కి తీసుకున్నారు. అన్ని వర్గాల ప్రజలు సకల జనుల సమ్మె చేసి ప్రభుత్వాన్ని స్తంభింపజేసి హోరాహోరీ పోరాటం చేస్తే మళ్లీ తెలంగాణ ఇచ్చారు. ఇదంతా మీరు కండ్లారా చూశారు అని కేసీఆర్ తెలిపారు. అనంతరం ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని కోవా లక్ష్మికి మద్దతుగా ప్రసంగించారు. బీఆర్ఎస్ గవర్నమెంట్‌లో ఆసిఫాబాద్‌లో 47 వేల ఎకరాలకు పోడు పట్టాలు ఇచ్చాం. వారందరికీ రైతుబందు ఇచ్చాం. రైతుబీమా కూడా పెట్టుకున్నాం. కాగజ్‌నగర్‌లో ఇద్దరు గిరిజనులు చనిపోతే రూ. 5 లక్షల చొప్పున బీమా అందిందని కోనేరు కోనప్ప చెప్పారు. ఆదివాసీ, లంబాడీ తండాలకు త్రీ ఫేజ్ కరెంట్ సదుపాయం కూడా కల్పిస్తున్నాం. ఇంకా మిగిలి ఉంటే అది కూడా పూర్తువుతుంది అని కేసీఆర్ పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రం కాకపోతే ఆసిఫాబాద్ జిల్లా కాకపోయేది. ఎన్నో ప్రయత్నాలు చేసినా ఎవరూ కూడా జిల్లా చేయలేదు. మారుమూల ప్రాంతం ఆసిఫాబాద్ జిల్లా అయితదని కలలో కూడా ఎవరూ అనుకోలేదు. కానీ ఇవాళ బీఆర్ఎస్ గవర్నమెంట్ ఉంది కాబట్టి, గిరిజన బిడ్డలకు, పేద వర్గాలకు న్యాయం జరగాలని జిల్లా చేశాం.

కేరళలో పోలీసులు, మావోలకు మధ్య ఎదురుకాల్పులు.!

- ఇద్దరు అరెస్ట్

టీ మీడియా, నవంబర్ 8, కేరళ :

కేరళలో పోలీసులు, మావోయిస్టుల మధ్య బుధవారం ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ సందర్భంగా ఇద్దరు మావోలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తాళప్పుజా పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెరియా ప్రాంతంలో కేరళ ప్రత్యేక బృందాలు, మావోయిస్టులకు మధ్య ఎన్‌కౌంటర్ జరిగిందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఫోన్ ఛార్జింగ్ కోసం ఇంట్లోకి వచ్చిన మావోయిస్టులు పోలీసులకు చిక్కారు. సమాచారం మేరకు.. పలువురు మావోయిస్టులు అటవీ ప్రాంతం నుంచి ఫోన్ ఛార్జింగ్ కోసం ఇంట్లోకి వచ్చారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య కాల్పులు జరిగినట్లు తెలుస్తున్నది. ముగ్గురు మావోయిస్టులు తప్పించుకొని పారిపోగా.. మరో ఇద్దరు పట్టుబడగా.. వారిని సమీపంలోని పోలీస్ క్యాంప్‌కు తరలించినట్లు తెలుస్తున్నది. పట్టుబడ్డ మావోయిస్టుల వివరాలు తెలియరాలేదు. ఇటీవల కోజికోడ్‌లో మావోయిస్ట్ సానుభూతిపరుడిని అరెస్టు చేశారు. అతని నుంచి సేకరించిన సమాచారం మేరకు కేరళ పోలీసులు ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక కమాండో బలగాలు, స్పెషల్ ఆపరేషన్ గ్రూప్, రాష్ట్ర పోలీసులకు చెందిన థండర్ బోల్డ్ స్క్వాడ్‌పై కాల్పులు జరిపారు.

మహువా మొయిత్రాపై సిబిఐ విచారణ

టీ మీడియా, నవంబర్ 8, న్యూఢిల్లీ :

టిఎంసి ఎంపి మహువా మొయిత్రాపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) విచారణ చేపట్టనున్నట్లు బిజెపి ఎంపి పేర్కొన్నారు. మహువా మొయిత్రాపై అవినీతి నిరోధక కమిటీ లోక్‌పాల్ సిబిఐ విచారణకు ఆదేశించినట్లు బిజెపి ఎంపి నిషికాంత్ దూబే బుధవారం ఎక్స్ (ట్విటర్)లో తెలిపారు. " నా ఫిర్యాదు ఆధారంగా, దేశ భద్రతకు విఘాతం కలిగించే మహువా మొయిత్రా అవినీతిపై లోక్‌పాల్ సిబిఐ విచారణకు ఆదేశించారు " అని బిజెపి ఎంపి ట్విట్ చేశారు. ప్రధాని మోడీ, అదానీ గ్రూప్‌ను లక్ష్యంగా చేసుకుని తన తరపున పార్లమెంటులో ప్రశ్నలు అడిగేందుకు వ్యాపారవేత్త దర్శన్ హీరానందానీ నుండి మొయిత్రా నగదు తీసుకున్నారని దూబే ఆరోపించిన సంగతి తెలిసిందే. అలాగే పార్లమెంటరీ లాగిన్‌ను కూడా షేర్ చేయడం ద్వారా జాతీయ భద్రతకు విఘాతం కలిగించినట్లు పేర్కొన్నారు.

ఇప్పటివరకు చూసింది ట్రైలర్ మాత్రమే

- మంత్రి కేటీఆర్

టీ మీడియా, నవంబర్ 8, హైదరాబాద్:

ఈ తొమ్మిదిన్నర ఏళ్లలో చూసింది కేవలం ట్రైలర్ మాత్రమేనని.. మళ్లీ తమ పార్టీ అధికారంలోకి వస్తే ఐదేళ్లలో 24 గంటలు తాగునీరు సదుపాయం కల్పిస్తామని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. సోమాజిగూడలోని ఓ హొటల్‌లో మల్లాపూర్, గాంధీనగర్, జీడిమెట్ల, నాచారం, చర్లపల్లి ప్రాంతాలకు చెందిన పారిశ్రామిక వేత్తలతో మంత్రి కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు."కేసీఆర్ ప్రభుత్వం వచ్చినప్పుడు ఎన్నో అనుమానాలు ఉండేవి. వీరికి పరిపాలన సాధ్యమవుతుందా? అనుకున్నారు. పదేళ్ల కిందట 10 రోజులు కరెంటు లేకపోయినా అడిగేవారు లేరు. ఇప్పుడేమో 10 నిమిషాలు కరెంటు పోతే ఇదేనా బంగారు తెలంగాణ అంటున్నారు. కర్ణాటక నుంచి నుంచి వచ్చిన ఒకాయనకు సరిగ్గా స్క్రిప్ట్ ఇవ్వకపోవడంతో.. మా రాష్ట్రంలో 5గంటల కరెంటు ఇస్తున్నాం అని చెబుతున్నారు. 24 గంటల కరెంటు ఇచ్చే తెలంగాణకు వచ్చి 5 గంటల కరెంటు ఇస్తున్నాం అంటున్నారు. దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రం తెలంగాణ మాత్రమే" అని మంత్రి కేటీఆర్ వివరించారు.కొత్త పరిశ్రమలకు ఇచ్చినట్టే పాత కంపెనీలకు కూడా రాయితీలు ఇవ్వాలని ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్‌ను పలువురు పారిశ్రామిక వేత్తలు కోరారు.

నీ కాలేజీ చుట్టూ 200 ఫీట్ల రోడ్లు... పేదొళ్ళకాలనీకు 10 ఫీట్ల రోడ్లా?

- బిడ్డా మల్లారెడ్డి.. ప్రజలు నీ బట్టలూడిస్తారు

- ఐదేళ్ళలో ఏం చేశావని ఓట్లు అడుగుతున్నావ్

- కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్

టీ మీడియా, నవంబర్ 7, జవహర్ నగర్ :

మల్లారెడ్డి... నీ కాలేజీ చుట్టూ 200 ఫీట్ల రోడ్లు.. పేదోళ్ళకాలనీలకు 10ఫీట్ల రోడ్లు వేస్తావా? ఇదేనా నీ సంస్కృతి.. పరిపాలన తెలవని సన్యాసి అని బీఆర్ఎస్ అభ్యర్థి మల్లారెడ్డిని కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రషయాదవ్ విమర్శించారు. బుధవారం జవహర్ నగర్ కార్పొరేషన్లో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ తో కలిసి రోడ్ నిర్వహించి పలు డివిజన్లలో పాదయాత్ర చేసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వజ్రేషాదవ్ మాట్లాడుతూ.. మేడ్చల్లో అక్రమంగా 600 ఎకరాల భూములను కబ్జాచేశాడని, అమాయక ప్రజలను మోసం చేస్తూ.. జిత్తులమారి మాటలతో కాలం వెళ్ళదీస్తున్నావని, బిడ్డా మల్లారెడ్డి.. మేడ్చల్ ప్రజలు నీ బట్టలు ఊడదీసి ఉరికిస్తారని అన్నారు. మల్లారెడ్డి మేడ్చలు పట్టిన దరిద్రమని, ఓట్ల సునామీ రూపంలో ప్రజలు నీకు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. మల్లారెడ్డి

కాలేజీలో పనిచేస్తున్న ఉద్యోగులతో వెట్టి చాకిరి చేయించడమే కాకుండా... స్థానిక నాయకులను నమ్మకుండా వారితో డబ్బులు పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. పేదలకు విద్యా, వైద్యం, కూడు, గూడు అందినప్పుడే అభివృద్ధి చెందుతారని, జవహరనగర్కు కాలేజీ, 100పడకల ఆసుపత్రి లేదని, నీ ఆస్తులను మాత్రం అందనంతా పెంచుకున్నావని ఎద్దేవ చేశారు. జర్నలిస్టులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్ళను కట్టిస్తానని అన్నారు. నేను యాదవ కుటుంబంలో జన్మించానని, నేను పాలు అమ్మిన కానీ.. నాకు కోట్ల ఆస్తులు రాలేదేమని,మల్లారెడ్డి పేదల భూములను అక్రమంగా

కబ్జాచేసి కోట్లు దండుకుని కష్టపడి పైకొచ్చానని అనడం సిగ్గుగా ఉందన్నారు. గిరిజనుల భూములను లాక్కొన్న మల్లారెడ్డి వారి ఉసురు నీకు పుడుతుందన్నారు. జవహర్ నగర్ ప్రజలు తెలివైనా వారని, ఆలోచించి

బహుజన బిడ్డనైన నన్ను ఆదరించి.. చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. తెలంగాణ లో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, పేద రాబోతుందని తెలిపారు. ఈ ప్రజలను అక్కున చేర్చుకునే సోనియమ్మ రాజ్యం. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, కార్పొరేటర్ నిహారికగౌడ్, కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్దవ్, నాయకులు కల్లెపల్లి సదానంద్, కాయిత రాజుయాదవ్, అనంతలక్ష్మి, మంజుల, రజిత, వేణు, వినయ్, మిట్టు, వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలి..?

- ప్రశ్నించిన మంత్రి తలసాని

టీ మీడియా, నవంబర్ 8, హైదరాబాద్ :

కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రశించారు. నగర పరిధిలోని వనస్థలీపురం, అంబర్‌పేటలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులతో కలిసి మంత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 130 సంవత్సరాల చరిత్ర ఉన్న కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో ప్రజలు బొందపెడుతారన్నారు. దశాబ్దాల పాటు అధికారంలో ఉండి ప్రజలకు ఏం చేశారో చెప్పే ధైర్యం ఉందా? అంటూ ప్రశ్నించారు. ఓటమి తప్పదనే భయంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పోటీ నుంచి తప్పుకున్నారని విమర్శించారు. రెండుసీట్లు గెలిచిన బీజేపీ బీసీని ఎలా ముఖ్యమంత్రిని చేస్తుందని నిలదీశారు. కేంద్రమంత్రిగా పార్లమెంట్ నియోజకవర్గంలో గానీ.. అంబర్‌పేట నియోజకవర్గంలో కానీ ఎన్ని నిధులు ఖర్చు పెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. మళ్లీ రాష్ట్రం అధికారంలో వచ్చేది ముమ్మాటికి బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. అన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.

హలో మాదిగ ఛలో పరేడ్ గ్రౌండ్

- 11న విశ్వరూప మహాసభను విజయవంతం చేయండి

టీ మీడియా, నవంబర్ 8, జవహర్ నగర్ :

జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అరుంధతి నగర్ బస్తీలో మాదిగ యువకులతో సమావేశ మైన కొత్త నరేష్ మాదిగ దో యా శ్రీనివాస్ మాదిగ ఏసన్న మాదిగల ఆధ్వర్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ హాజరై మాట్లాడుతూ.. నవంబర్ 11న జరగబోయే మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని పిలుపునివ్వడం జరిగింది. మాదిగ ఉప కులాలకు జరుగుతున్న రిజర్వేషన్ల దోపిడీని క్లుప్తంగా వివరించి వర్గీకరణ మీద పూర్తిగా అవగాహన కలిగించి ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితాలను వారికి తెలియపరచి ఉత్తేజపరిచిన గోవిందు నరేష్ మాదిగ మాదిగలు తలుచుకుంటే ఏం జరుగుతుందో ఈ ప్రపంచానికి చా

బద్రినాథ్ ఆలయాన్ని సందర్శించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

టీ మీడియా, నవంబర్ 8, ఉత్తరాఖండ్ :
ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉత్తరాఖండ్ రాష్ట్రం చమోలీ జిల్లాలోని బద్రినాథ్ ఆలయాన్నిరాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం సందర్శించారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో అక్కడికి చేరుకున్న రాష్ట్రపతికి ఉత్తరాఖండ్ గవర్నర్ గుర్మిత్ సింగ్, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి, బద్రినాథ్–కేదార్‌నాథ్ ఆలయ కమిటీ చైర్మన్ అజేంద్ర అజయ్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో రాష్ట్రపతి 25 నిమిషాల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ అజయ్.. రాష్ట్రపతికి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందించారు. ఇక సీఎం ధామీ ఆలయ ప్రతిరూపాన్ని బహూకరించారు. ఆలయ సందర్శన అనంతరం రాష్ట్రపతి శ్రీనగర్ బయలుదేరి వెళ్లారు.

తెలంగాణలో రెండు రోజుల పాటు వర్షాలు

టీ మీడియా, నవంబర్ 8, హైదరాబాద్ :
తెలంగాణ రాష్ట్రంలో రెండు రోజుల పాటు వర్షాలు పడనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది. రెండు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉత్తర కోస్తా తీరంలో ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఆ ద్రోణి కారణంగా రాష్ట్రంలో వర్షాలు కురవనున్నట్లు ఐఎండీ తెలిపింది. దక్షిణ మధ్య తెలంగాణ జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే ఛాన్స్ ఉంది 11వ తేదీ నుండి రాష్ట్రంలో పొడి వాతావరణం ఉండనున్నట్లు పేర్కొంది. సీజన్స్ లెట్ అక్టోబర్‌లో పడాల్సిన వర్షం నవంబర్‌లో పడుతోందని వాతావరణ శాఖ చెప్పింది. నవంబర్ మూడో వారం నుంచి రాష్ట్రంలో చలి తీవ్రత పెరగనున్నట్లు హెచ్చరించింది. ఈశాన్య రుతుపవనాల కారణంగా తెలంగాణలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తారు వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. వచ్చే రెండు రోజులు రోజులు హైదరాబాద్, మహబూబ్‌నగర్, వికారాబాద్, నల్లగొండ, సూర్యాపేట, నారాయణ పేట, రంగారెడ్డి జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని చెప్పారు. మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లోనూ అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఇక రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు 30 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపారు.

రాత్రి సమయాల్లో ఉష్ణోగ్రతలు 22 డిగ్రీల సెల్సియస్‌గా పడిపోతాయన్నారు. హైదరాబాద్ సహా పొరుగు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయన్నారు. రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రతల్లో స్వల్ప తగ్గుదలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల వర్షాలు కురుస్తాయని చెప్పారు.

టిడిపి నాయకులపై తప్పుడు కేసులు బనాయిసుంచడమే వైసిపి పని

- టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్

టీ మీడియా, నవంబర్ 8, అమరావతి:

తప్పుడు కేసులు బనాయించడంలో కొంతమంది పోలీసులు గిన్నిస్ బుక్‌లో స్థానం కోసం పోటీ పడుతున్నట్లుగా కనిపిస్తోందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. పల్నాడు జిల్లా నరసరావుపేట నియోజకవర్గం రొంపిచర్లకు చెందిన తెలుగు యువత ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిని సోషల్ మీడియాలో పోస్టుల కేసు విచారణకంటూ తీసుకెళ్లి అక్రమ మద్యం కేసులో ఇరికించారని ఆరోపించారు. గత నాలుగున్నరేళ్లుగా టిడిపి కార్యకర్తలు, నాయకులపై రాష్ట్రవ్యాప్తంగా 60వేల తప్పుడు కేసులు బనాయించారని లోకేశ్ మండిపడ్డారు. సైకో సీఎం కళ్లలో ఆనందం కోసం న్యాయదేవత కళ్లకు గంతలుకట్టి టిడిపి కేడర్‌ను ఇబ్బందుల పాల్జేస్తున్న కొంతమంది పోలీసులు త్వరలో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని లోకేశ్ హామీ ఇచ్చారు.



ఎన్నికల విధులు ముగించుకుని వస్తుండగా ప్రమాదం

- ముగ్గురు మృతి

టీ మీడియా, నవంబర్ 8, రాయ్ పూర్ :
ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికల విధులు ముగించుకొని వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై ముగ్గురు ఉపాధ్యాయులు మరణించారు. కేశ్కల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బహిగావ్ గ్రామ సమీపంలో బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. కొండగాన్ జిల్లా కేంద్రంలో ఈవిఎంలు అప్పగించి తిరిగి వస్తుండగా వీరు ప్రయాణిస్తున్న ఎస్‌యువి వాహనం కొండగాన్ జిల్లాలో ఓ ట్రక్కుని ఢ కొట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఇద్దరు ఉపాధ్యాయులు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయని అన్నారు. గాయపడిన వ్యక్తిని సమీప ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో మొత్తం 90 స్థానాల్లో 20 స్థానాలకు మంగళవారం మొదటి దశ పోలింగ్ జరిగిన సంగతి తెలిసిందే.

ఎస్ఎస్ టి టీం ద్వారా భారీ నగదు పట్టివేత

టీ మీడియా, నవంబర్ 8, పెద్దమందడి: వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్ల గ్రామ సమీపంలోని జాతీయ రహదారి బుర్రవాగు స్టేజ్ దగ్గర పెద్దమందడి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్ ఎస్ టి టీం చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించగా ఎలాంటి ఆధారాలు లేకుండా హైదరాబాదు నుండి వనపర్తి వెళ్తున్న పుల్లయ్య తండ్రి గురువాయ్య దగ్గర 1,10,000/– ను పట్టుకొని సీజ్ చేయడం జరిగింది. అలాగే కామారెడ్డి నుండి వనపర్తికి వెళుతున్న బిఆర్ఎస్ బిజెపి కండువాలను తరలిస్తున్న కేయం రాజు తండ్రి బాలరాజు దగ్గర 50,500/– నగదును ఎస్ ఎస్ టి టీం ద్వారా సీజ్ చేసి గ్రీవెల్ కమిటీకి తరలించడం జరిగిందని ఎస్ఐ హరి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

రెండు వారాల్లో రెండోసారి సుప్రీంకోర్టుకు కేరళ ప్రభుత్వం

టీ మీడియా, నవంబర్ 8, తిరువనంతపురం :
గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్‌పై కేరళ ప్రభుత్వం బుధవారం మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రెండు వారాల్లో ఇది రెండవసారి పిటిషన్ దాఖలు చేయడం గమనార్హం. కోవిడ్ అనంతర ప్రజారోగ్య సమస్యలను పరిష్కరించే కీలకమైన బిల్లులను ఆమోదించకుండా ప్రజల హక్కులను ఓడించడానికి యత్నిస్తున్నారని ఆరోపించింది. సుమారు ఎనిమిది కీలక బిల్లులు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో కొన్ని రెండేళ్లుగా వాయిదా పడ్డాయి. గవర్నర్ నిరంకుశ చర్య కేరళ ప్రజల ప్రాథమిక హక్కును ఉల్లంఘించడమేనని రాష్ట్రం తరపున న్యాయవాది సి.కె. శశి తెలిపారు. బిల్లులను దీర్ఘకాలంగా, నిరవధికంగా పెండింగ్‌లో ఉంచడంతో గవర్నర్

నిరంకుశ ప్రవర్తన రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ని కూడా ఉల్లంఘిస్తుందని పిటిషన్‌లో పేర్కొన్నారు. రాష్ట్ర అసెంబ్లీ రూపొందించిన సంక్షేమ ప్రయోజనాలను ప్రజలకు అందకుండా చేయడం ద్వారా ఆర్టికల్ 21 (జీవించే హక్కు) ప్రకారం కేరళ ప్రజల హక్కులను ఉల్లంఘిస్తున్నారని తెలిపారు. గతేడాది నవంబర్ 30న కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై 461 పేజీల స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్‌కు సమర్పించిన బిల్లులను పరిష్కరించేందుకు కాలపరిమితిని నిర్ణయించాలన్న కేరళ ప్రభుత్వ పిటిషన్‌ను కేరళ హైకోర్టు నిరాకరించిన సంగతి తెలిసిందే. ఆర్టికల్ 200 ప్రకారం.. బిల్లును ఆమోదించడం లేదా, రాష్ట్ర అసెంబ్లీకి తిప్పి పంపడం, లేదా రాష్ట్రపతికి సిఫారసు చేయాల్సి వుంది. ఏదేమైనప్పటికీ ఈ ఆర్టికల్ ప్రకారం గవర్నర్ సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకోవాల్సి వుంటుంది.

ఈసీ కీలక నిర్ణయం

టీ మీడియా, నవంబర్ 8, హైదరాబాద్:
తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. వృద్ధులు, వికలాంగులు తదితర ఓటర్లతో పాటు పోలింగ్ బూత్ లకు సహాయకులుగా వచ్చేవారి చేతి వేలిపై కూడా సిరా గుర్తును వేయాలని నిర్ణయించింది. సహాయకుల కుడి చేతి చూపుడు వేలికి ఇంకు గుర్తు పెట్టాలని ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా ఓటర్లకు ఎడమ చేతి వేలిపై సిరా గుర్తు పెడతారు. పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ఏజెంట్లుగా సర్పంచ్ లు, వార్డు సభ్యులు కూర్చునే అవకాశాన్ని కూడా సీఈసీ కల్పించింది. మాక్ పోలింగ్ ను ఉదయం 5.30 గంటలకు ప్రారంభించాలని సూచించింది.

చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

టీ మీడియా, నవంబర్ 8, అమరావతి:
ఉచిత ఇసుక విధానం వల్ల రాష్ట్ర ఖజానాకు నష్టం వాటిల్లిందనే ఆరోపణతో సీఐడీ నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ టిడిపి అధినేత చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. తదుపరి విచారణను ఈ నెల 22కి వాయిదా వేసిన ఉన్నత న్యాయస్థానం.. కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాజకీయ కార్యకలాపాలకు తనను దూరంగా ఉంచాలని, న్యాయవిచారణ ప్రక్రియలో మునిగిపోయేలా చేయాలని, వేధించాలన్న ఏకైక ఉద్దేశంతో ఈ కేసు నమోదు చేశారని పిటిషన్‌లో చంద్రబాబు పేర్కొన్నారు. 'వైసిపి పాలనలో ఇసుక అక్రమాలు, అవినీతిపై నేను, ఇతర ప్రతిపక్ష నేతలు గళమెత్తుతున్నాం. మా నోళ్లు మూయించాలనే కేసు పెట్టారు. మేం ప్రభుత్వ అక్రమాలపై గొంతెత్తుతున్న అంశాలను ముడిపెట్టి మాపైనే తప్పుడు కేసులు నమోదు చేశారు. ప్రభుత్వం ప్రతీకారానికి పాల్పడుతోంది' అని పిటిషన్‌లో పేర్కొన్నారు.

కోర్టు తీర్పుతోనైనా ప్రతిపక్షాలు

అసత్యాలు మానుకోవాలి
- మంత్రి గంగుల

టీ మీడియా, నవంబర్ 8, కరీంనగర్ :
గత ఎన్నికల్లో కరీంనగర్ ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన తనపై ప్రతిపక్షాలు చేసిన కుట్రలు వీగిపోయాయని, ప్రజల ఆశీర్వాదంతో నామినేషన్ వేసిన రోజే హైకోర్టు తీర్పు రావడం శుభసూచకంగా భావిస్తున్నానని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌అన్నారు. ఎన్నికల వ్యయం పెరిగిందని పొన్నం ప్రభాకర్ వేసిన కేసును బుధవారం హైకోర్టు కొట్టి వేసింది. గతంలో బండి సంజయ్ వేసిన కేసులోనూ హైకోర్టు అతనికి జరిమానా విధించి మొట్టికాయలు వేసిన విషయం విధితమే. ఈ సందర్భంగా కరీంనగర్‌లో నామినేషన్ వేసిన అనంతరం మంత్రి గంగుల మాట్లాడుతూ.. న్యాయమే దిక్సూచిగా ప్రజాసేవ కోసం పనిచేస్తున్న తనను కరీంనగర్ ప్రజలు ఇప్పటికే వరుసగా ఐదుసార్లు గెలిపించారన్నారు. కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా, మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలవడం వెనక ప్రజలతో తనకున్న సాన్నిహిత్యమే కారణమన్నారు. దీన్ని సహించలేని ప్రతిపక్షాలు కుట్రలతో కేసులు వేస్తే న్యాయం తన పక్షాన ఉంది కాబట్టే వీగిపోతున్నాయని స్పష్టం చేశారు. ఈ తీర్పుతోనైనా ప్రతిపక్షాలు తమ కుత్సిత బుద్ధి వీడి ప్రజాక్షేత్రంలో ప్రజల మన్నన ఉన్న తనను

విమర్శించడం మానుకోవాలన్నారు. రాబోయే ఎన్నికల్లోను బీఆర్ఎస్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమన్నారు.

నోట్ల రద్దుకు ఏడేండ్లు : మోదీ సర్కార్‌పై విరుచుకుపడిన కాంగ్రెస్

టీ మీడియా, నవంబర్ 8, న్యూఢిల్లీ :
మోదీ ప్రభుత్వం అనాలోచితంగా చేపట్టిన నోట్ల రద్దుతో సామాన్యులు ఎదుర్కొన్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావని కాంగ్రెస్ గుర్తుచేసింది. నోట్ల రద్దు జరిగి ఏడేండ్లు పూర్తయిన క్రమంలో కాషాయ పాలకులు లక్ష్యంగా కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. నోట్ల రద్దు దేశ ఆర్థిక వ్యవస్థపై, ప్రజల జీవనోపాధిపై అతిపెద్ద దాడిగా కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే అభివర్ణించారు. ఈ అనాలోచిత తప్పుడు నిర్ణయంతో భారతీయులు ఇప్పటికీ ఆ గాయాల నుంచి తేరుకోలేదని ట్విట్టర్ వేదికగా ఆయన రాసుకొచ్చారు. నోట్ల రద్దుతో లక్షలాది చిరు వ్యాపారాలు మూతపడ్డాయని, ఉద్యోగాలు కనుమరుగయ్యాయని, ప్రజలు పొదుపు చేసుకున్న సొమ్ము ఆవిరైందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ నవంబర్ 8 రాత్రి తీసుకున్న ఈ నిర్ణయంతో దెబ్బతిన్న ప్రజలు ఏడేండ్ల తర్వాత కూడా సమాధానాల కోసం వెతుకుతున్నారని అన్నారు. కోట్లాది మంది ప్రజలు తమ సొంత డబ్బు కోసం బ్యాంకుల ఎదుట ఎందుకు బారులు తీరాల్సి వచ్చిందని ప్రశ్నించారు. నోట్ల రద్దుతో నల్ల ధనం తుడిచిపెట్టుకుపోయిందా..? ఉగ్రవాద కార్యకలాపాలు నిలిచిపోయాయా..? నకిలీ కరెన్సీ తగ్గుముఖం పట్టిందా..? అని ఖర్గే నిలదీశారు. ఒక్కసారిగా నోట్లను రద్దు చేసినా మనం నగదురహిత ఆర్థిక వ్యవస్థగా ఎందుకు అవతరించలేదని ప్రశ్నించారు.

మణిపూర్‌లో కుకీ కమ్యూనిటీకి చెందిన నలుగురు కిడ్నాప్

టీ మీడియా, నవంబర్ 8, న్యూఢిల్లీ :
మణిపూర్‌లోని కుకీ కమ్యూనిటీకి చెందిన ఐదుగురు సభ్యులను కిడ్నాప్‌కు గురైనట్లు అధికారులు బుధవారం తెలిపారు. కుకీల ఆధిపత్యం అధికంగా ఉండే కాంగ్‌పోక్సీ మరియు మైతేయిల ఆధిపత్యం అధికంగా ఉండే ఇంఫాల్ పశ్చిమజిల్లా సరిహద్దుల్లో ఉన్న కాంగ్‌చుప్ చింఖోంగ్‌కు సమీపంలో మంగళవారం ఉదయం 8.45 గంటలకు సాయుధ దుండగులు వారిని కిడ్నాప్ చేసినట్లు అధికారులు తెలిపారు. వీరిలో నలుగురు సైనికుని కుటుంబసభ్యులుగా గుర్తించారు. కాంగ్‌చుప్ చింఖోంగ్ గ్రామంలోని చెక్‌పోస్ట్ వద్ద బొలెరోను ఆపామని, కారులో ఐదుగురు వ్యక్తులు ఉన్నట్లు భద్రతా దళాలు తెలిపాయి. వెంటనే కిడ్నాపర్లపై కాల్పులు చేపట్టామని అయితే ఒకరిని మాత్రమే రక్షించగలిగినట్లు పేర్కొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు పోలీసులు సహా తొమ్మిది మందికి గాయాలయ్యాయి. కిడ్నాపర్ల చెర నుండి రక్షించిన మంగ్లున్‌హెూకిప్ (65)కి కూడా తీవ్రగాయాలయ్యాయని.. అతనిని లిమాఖోంగ్‌లోని సైనిక ఆస్పత్రిలో చేర్చినట్లు వెల్లడించారు. ఇతరుల ఆచూకీ లభించలేదని అన్నారు. అయితే హెూకిప్ చనిపోయినట్లు భావించిన దుండగులు విడిచిపెట్టి పారిపోయారని అన్నారు. కిడ్నాప్ అయిన వారిలో ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారని కుకీ కమ్యూనిటీ తెలిపింది. వారిని విడింపించేందుకు అవసరమైన సహాయకచర్యలు చేపట్టాల్సిందిగా కేంద్రాన్ని కోరింది. కిడ్నాప్ గురైన వ్యక్తుల గురించి భయపడుతున్నామని ఆందోళన వ్యక్తం చేసింది.

బీహార్ సీఎం క్షమాపణ

మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు..

టీ మీడియా, నవంబర్ 8, పాట్నా:
బీహార్ సీఎం నితీశ్ కుమార్ అసెంబ్లీలో క్షమాపణలు తెలిపారు. చదువుకున్న మహిళలను కించపరిచేలా అసెంబ్లీలో చేసిన కామెంట్ పట్ల ఆయన బుధవారం క్షమాపణలు చెప్పారు. అసెంబ్లీలో ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేయడంతో తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు సీఎం నితీశ్ తెలిపారు. జనాభా నియంత్రణ విషయంలో మహిళా పాత్ర కీలకమైందని, ఈ నేపథ్యంలో సెక్స్ ఎడ్యుకేషన్ అవసరమన్న విషయాన్ని ప్రస్తావిస్తూ ఆయన అసెంబ్లీలో కొన్ని వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో పునరుత్పత్తి రేటు తగ్గిన అంశం గురించి సభలో చర్చిస్తూ.. భార్య చదువుకున్నదైతే .. గర్భం రాకుండా శృంగారం ఎలా చేయాలో తెలుస్తుందని సీఎం నితీశ్ అన్నారు. కుల గణన రిపోర్టును అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తర్వాత సీఎం నితీశ్ ఆ అంశంపై మాట్లాడుతూ సెక్స్ ఎడ్యుకేషన్ గురించి కూడా కొన్ని కామెంట్లు చేశారు. శృంగారం వల్ల గర్భం దాల్చుకుండా ఎలా ఉండాలన్న విషయం చదువుకున్న మహిళలకు తెలుస్తుందని ఆయన అన్నారు. ఈ విషయాన్ని నొక్కి చెప్పేందుకు ఆయన కొంత ఘాటు భాషను వాడారు. చదువుకున్న మహిళల వల్ల జనాభా నియంత్రణ జరుగుతుందని ఆయన తన ప్రసంగంలో తెలిపారు. బీహార్‌లో ఫెర్టిలిటీ రేటు 4.2 శాతం నుంచి 2.9 శాతానికి పడిపోయిందని రిపోర్టులో ఉన్న విషయాన్ని నితీశ్ సభలో తెలిపారు. అయితే నితీశ్ చేసిన ఆ వ్యాఖ్యలపై తీవ్ర దుమారం చెలరేగుతోంది. చాలా నీచమైన భాషను సీఎం నితీశ్ వాడారని ప్రతిపక్ష బీజేపీ ఆరోపించింది. డిప్యూటీ సీఎం తేజస్వియాదవ్ మాత్రం నితీశ్‌ను సమర్థించారు. స్కూళ్లల్లో బోధిస్తున్న సెక్స్ ఎడ్యుకేషన్ విషయాన్ని నితీశ్ చెప్పినట్లు ఆయన వెల్లడించారు. సీఎం నితీశ్ కుమార్ క్షమాపణలు చెప్పాలని జాతీయ మహిళా కమీషన్ చైర్‌పర్సన్ డిమాండ్ చేశారు. విధాన సభలో మహిళల గురించి వ్యాఖ్యలు

చేయడం మహిళల్ని అవమానించడమే అవుతుందన్నారు.